క్లుప్తంగా

30న ఒంగోలులో వైఎస్సార్ సీపీ సమావేశం

కనిగిరిరూరల్: రీకాల్ బాబు మేనిఫెస్టోపై కీలక సమావేశం ఈనెల 30న సోమవారం ఉదయం 10 గంటలకు ఒంగోలు పార్టీ కార్యాలయంలో జరుగుతుందని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి హాజరవుతారని వివరించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, పార్టీ అనుబంధ సంఘాల రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు అందరూ హాజరు కావాలని కోరారు.

రేషన్ దుకాణం తనిఖీ



నల్లగండ్లలో రేషన్ షాపును తనిఖీ చేస్తున్న తహసీల్దార్

హనుమంతునిపాడు: మండల పరిధిలోని తిరామ్మారెడ్డిపల్లి, నల్లగండ్ల గ్రామాల్లోని రేషన్ షాపులను తహసీల్దార్ షేక్ నాగూర్ మీరా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో రేషన్ దుకాణంలోని స్టాక్, రేషన్ కార్డుల వివరాలు పరిశీలించారు. అనంతరం నల్లగుండ్ల, తిమ్మారెడ్డిపల్లిలో పోలింగ్ బూత్‌లు పరిశీలించారు. ఆర్ఐ కృష్ణచైతన్య, వీఆర్ఓ బాదుర్ల పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్య



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పార్వతి

పామూరు: ప్రీ స్కూల్ పిల్లలందరినీ తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని వగ్గంపల్లె ఎస్టీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సమావేశం, అంగన్‌వాడీబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు కేంద్రంలోని పిల్లలకు బోధనోపకరణాలు, ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను బోధించాలన్నారు. కేంద్రం నిర్వహణలో అనుసరించాల్సిన తీరును వివరించారు.

జెడ్పీ నిధులతో పాఠశాలలో అభివృద్ధి పనులు



గ్రౌండ్‌ను లెవల్ చేస్తున్న దృశ్యం

వెలిగండ్ల,(కనిగిరిరూరల్): మండలంలోని వెలిగండ్ల కస్తూరిబా గాంధీ పాఠశాలలో జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి సహకారంతో పాఠశాల అభివృద్ధి పనులు శనివారం జరిగాయి. పాఠశాల ఆవరణలోని భూమి లెవలింగ్ పనులు చేయించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా పనులు చేయించినట్లు సర్పంచ్ తాతపుడి సురేష్ బాబు తెలిపారు. ఈమేరకు జెడ్పీటీసీ సంఘం అధ్యక్షులు గుంటక తిరుపతిరెడ్డికి సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రచార ఆర్భాటం.. ఆచరణలో విఫలం

- జీసీ కార్పొరేషన్ రుణాల కోసం ఎదురుచూపులు
- ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం
- లబ్ధిదారుల ఇంటర్వ్యూలు ముగిసినా పైసా విదల్చని ప్రభుత్వం
- ఏం చెప్పాలో తెలియక మౌనం దాల్చుతున్న అధికారులు



కనిగిరి మండల పరిషత్ కార్యాలయం

కనిగిరిరూరల్:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాల ప్రచార ఆర్భాటాలే తప్ప ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేసిన దాఖలాలు లేవు. సూపర్ సిక్స్ పథకాల పరిస్థితి అలా ఉంచితే.. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ రుణాల మంజూరు పేరుతో హడావుడి చేశారు. కానీ క్షేత్ర స్థాయిలో కార్యచరణ రూపు దాల్చలేదు. కారణాలు ఏమైనా బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు ఉత్తుత్తి ప్రచారంగా మిగిలిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనిగిరి నియోజకవర్గంలో ఎంతో ఆర్భాటంగా బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుల స్వీకరణ, మార్చి 18,19 తేదీల్లో హడావుడిగా ఇంటర్వ్యూలు జరిగాయి. కానీ నేటికీ ఒక్కరికీ రుణాలు ఇచ్చిన దాఖలాలు లేవు. దీంతో ప్రభుత్వ తీరుపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. రుణాలంటూ హడావిడి చేసి ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ..

కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో బీసీ కార్పొరేషన్ ద్వారా సుమారు 197 యూనిట్ల వరకు లక్ష్యం విధించారు. కనిగిరి మండలంలోనే 29, మున్సిపాలిటీకి 37, వెలిగండ్ల 34, పీసీపల్లి 25, హెచ్ఎంపాడులో 27, పామూరు, సీఎస్‌పురం మండలాల్లో 45 యూనిట్లు కేటాయించారు. ఒక్కో యూనిట్ విలువ రూ.లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు కేటాయింపు ఉంటుంది. అందులో బ్యాంకర్ల వాటా సగం, ప్రభుత్వ సబ్సిడీ వాటా సగంగా ఉంటుంది. అయితే కనిగిరి మున్సిపాలిటీలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియతోనే రుణాల మంజూరుకు బ్రేక్ పడినట్లు తెలిసింది. కనిగిరి రూరల్ మండలంలోని 25 పంచాయతీలు 20 సచివాలయాలకు 29 యూనిట్లు కేటాయించారు. ఈ మేరకు రూ.56 లక్షలు రుణాల మంజూరు లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికి సంబంధించి మార్చి 18,19 తేదిల్లో బీసీ కార్పొరేషన్ అధికారులు, బ్యాంకర్లు, మండల పరిషత్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 29 యూనిట్లకు సంబంధించి 25 పంచాయతీల నుంచి 177 మంది దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూలకు వచ్చారు.

నేటికి అందని రుణాలు..

177 మందిలో 29 మందినే అధికారులు అర్హులకు తేల్చారు. వారికి ఇంటర్వ్యూవలు సైతం జరిగి రెండు నెలలు దాటింది. కానీ ఇంత వరకు రుణాల ఊసే లేదు. ప్రభుత్వం ఇచ్చే సగం వాటా సబ్సిడీ ఇస్తే.. బ్యాంకర్లు రుణాలు ఇచ్చే పరిస్థితి ఉన్నట్లు తెలిసింది. దీంతో తమకు రుణాలు మంజూరు అయ్యాయని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు నిరాశ మిగిలేటట్లుంది. ఎందుకంటే కొన్ని చోట్ల అసలు అసలు ఇంటర్వ్యూలు కూడా జరగలేదని తెలుస్తోండగా.. మరి కొన్ని చోట్ల ఇంటర్వ్యూలు నిర్వహించిన తర్వాత అర్హత సాధించిన లబ్ధిదారుల జాబితా బ్యాంకర్ల వద్దకే చేరలేదని తెలిసింది. దీనంతటికి కారణం ప్రభుత్వ ఇవ్వాల్సిన సబ్సిడీ వాటా ఇవ్వక పోవడమేనని తెలుస్తోంది. ఏది ఏమైనా..కూటమి ప్రభుత్వం పాలనలో కార్పొరేషన్ రుణాల మంజూరు నీటి మీద రాతల్లో మారయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం



సిబ్బందితో డ్రిల్ నిర్వహిస్తున్న సీఐ సోమశేఖర్

కొండపి: సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాలపై ఉక్కుపాదం మోపాలని కొండపి సీఐ జి.సోమశేఖర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సర్కిల్ పరిధిలోని సిబ్బందికి డ్రిల్, గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సోమశేఖర్ సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వ్యాయామం చేస్తూ ఫిట్నెస్ కలిగి ఉండాలని సూచించారు. కుటుంబపరంగా సమస్యలు లేకుండా చూసుకోవాలని, పిల్లల చదువుపరంగా జాగ్రత్త వహించాలని, ఉద్యోగపరంగా ఏవైనా సమస్యలు ఉన్నా, జీతాల సమస్యలు ఉన్నా మా దృష్టికి తీసుకొని వస్తే ఎస్పీతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. సర్కిల్ పరిధిలో అక్రమ ఇసుక, పేకాట, గంజాయి అమ్మకాలు, కోడి పందేలు వంటివి నిర్వహించే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారిపై నాన్ బెయిల్‌బుల్ కేసులు నమోదు చేయాలన్నారు. సిబ్బందికి కేటాయించిన ఆయా గ్రామాల పరిధిలో నిర్వహించే కార్యక్రమాలపై దృష్టి సారించి ఎస్సైలకు వివరాల అందించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థతో ప్రతి ఒక్కరితో స్నేహపూర్వక వాతావరణం కలిగి ఉండాలని సూచించారు. ఎస్సై ప్రేమ్‌కుమార్, మర్రిపూడి ఎస్సై రమేష్‌బాబు, పొన్నలూరు ఎస్సై అనూక్, సర్కిల్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

సీఎస్‌పురం(పామూరు): మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీ స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ఎంపీపీ, కో ఆప్షన్ సభ్యులతో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు.

పాఠశాలకు వాటర్ ఫ్రిజ్ అందజేత

పీసీపల్లి: మండల పరిధిలోని వెంగలాయపల్లె ప్రాథమిక పాఠశాలకు కనిగిరి చెందిన పంచాయతీ సెక్రటరీ రవి రూ.10 వేల విలువైన వాటర్ ఫ్రిజ్‌ను అందజేశారు. సీఆర్పీ వెంగల్‌రెడ్డి కుర్చీలు, మోతుకూరి శ్రీను రెండు ఫ్యాన్లను అందజేశారు. పాఠశాల అభివద్ధికి సహకరిస్తున్నటువంటి వీరిని ఎంపీడీఓ హనుమంతరావు , డిప్యూటీ ఎంపీడీఓ రాంప్రసాద్, ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సుభాని అభినందించారు. స్వర్ణ రమణయ్య, అరుణ, లక్ష్మయ్య, మాలకొండయ్య తదితరులు ఉన్నారు

ఆర్టీసీ డిపోను పరిశీలించిన అధికారులు



టంగుటూరు బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్ఎం సత్యనారాయణ

టంగుటూరు: 'సమస్యల స్టాండ్'అన్న శీర్షికన సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. శనివారం టంగుటూరు బస్టాండ్‌ను పరిశీలించారు. ఆర్టీసీ ఆర్ఎం జి.సత్యనారాయణ మాట్లాడుతూ బస్టాండ్‌లో పిచ్చి మొక్కలను తొలగించాలని, పరిసరాలను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రయాణికులు బొమ్మల సెంటర్ వద్ద కాకుండా బస్టాండ్‌లో బస్సులు ఎక్కేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ ఫణికుమార్ పాల్గొన్నారు.

247 పొగాకు బేళ్లు తిరస్కరణ

కొండపి: స్థానిక వేలం కేంద్రంలో శనివారం జరిగిన వేలంలో 247 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. వేలానికి ధర్మవరం, కోయవారిపాలెం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం, వెంకటకృష్ణాపురం గ్రామాలకు చెందిన రైతులు 1055 బేళ్లను తీసుకురాగా 808 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.246.01గా నమోదైంది. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయి.



టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శనివారం జరిగిన వేలంలో 176 పొగాకు బేళ్లు తిరస్కరణ జరిగాయి. చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 976 బేళ్లను తీసుకురాగా 800 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160 పలికి సరాసరి రూ.240.21గా నమోదైంది. వేలంలో 25 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీ ప్రసాద్

సింగరాయకొండ: కౌలు రైతులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు కలిగి ఉంటేనే ప్రభుత్వ పథకాల లబ్ధి పొందగలరని డిప్యూటీ తహశీల్దార్ తానికొండ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో శనివారం కౌలు రైతులకు గుర్తింపు కార్డుల మంజూరుపై అవగాహన కల్పించారు. డీటీ ప్రసాద్ మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులు ఉంటేనే ప్రభుత్వ పథకాలు, సున్నా వడ్డీ పంట రుణాలు, క్రాప్ ఇన్సూరెన్సులకు అర్హులని వివరించారు. కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం వీఆర్ఓను సంప్రదించాలని సూచించారు. ఏడీఏ ఈ నిర్మలకుమారి, ఏఓ టి.పూర్ణచంద్రరావు, రైతులు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

పొన్నలూరు: మండలంలోని కొత్తశింగరబొట్లపాలెం గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై అనూక్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న జూదరులను అదుపులోకి తీసుకోని వారి దగ్గర నుంచి రూ.20,430 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

పృధులగిరి ఆలయ అభివృద్ధికి కృషి

మర్రిపూడి: పృధులగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. పృధులగిరిపై వేంచేసిన లక్ష్మీనృసింహస్వామిని శనివారం దర్శించుకున్నారు. అనంతరం కొండపై రూ.50 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, మర్రిపూడి నుంచి యానాది కాలనీ వరకు రూ.8.5 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును ప్రారంభించారు. ఆయన వెంట ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ కోటేశ్వరరావు, డీఈలు రవిబాబు, శ్రీధర్ రెడ్డి, జేఈ ప్రసాదురావు, సీఐ సోమశేఖర్, ఎంపీడీఓ జగదీష్ ఉన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



రేషన్ దుకాణాన్ని తనిఖీచేస్తున్న తహసీల్దార్

పామూరు: రేషన్ దుకాణం నిర్వాహకులు, వాటర్ ప్లాంట్, పెట్రోల్‌బంక్‌ల నిర్వాహకులు ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించాలని తహసీల్దార్ రామచంద్రుని వాసుదేవరావు అన్నారు. పామూరులోని రేషన్‌దుకాణాలు, మంచినీటి ఆర్వో ప్లాంట్లు, పెట్రోల్‌బంక్‌లు, బాణసంచా దుకాణాలను, ఎఫ్‌సీఐ గోడవున్‌ను శనివారం పంచాయతీ కార్యదర్శి జి.అరవిందారెడ్డితో కలిసి తహసీల్దార్ క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీచేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ దుకాణం నిర్వాహకులు కార్డుదారులకు క్రమం తప్పకుండా రేషన్ ఇవ్వాలని సూచించి స్టాకు వివరాలను పరిశీలించారు. ఎఫ్‌సీఐ గోడౌన్‌లో స్టాకు పరిశీలించారు. బాణసంచా దుకాణాన్ని పరిశీలించిన ఆయన లైసెన్స్, భద్రతపై చర్చించి సూచనలు చేశారు. పెట్రోల్‌బంక్‌ను తనిఖీ చేసి కొలతలు వేయించారు. కల్తీ లేకుండా నాణ్యమైన పెట్రోల్, డీజిల్ వినియోగదారులకు అందించాలని సూచించారు. ఎవరైనా మోసాలకు పాల్పడితే చర్యలకు ఉపేక్షించేంది లేదని హెచ్చరించారు.

కేంద్ర బృందం పరిశీలన



ఎంపీడీఓ రమణమూర్తితో సమావేశమైన కేంద్రబృందం

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని జరుగుమల్లి, చిర్రికూరపాడు గ్రామాల్లో కేంద్ర బృందం సభ్యులు అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాల, మురుగుకాల్వల్లో పారిశుధ్య పనులను, తాగునీటి వనరులను పరిశీలించారు. తరువాత ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రమణమూర్తితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేంద్రబృందం సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతను బట్టి ఆయా పంచాయతీలకు ర్యాంకులు ఇస్తామన్నారు. కేంద్రబృందం సభ్యులు జి.రవివర్మ, బి.పద్మిని, మధుమిత, జి.సుధీర్, డిప్యూటీ ఎంపీడీఓ కామేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం పాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత



బంగారు బాల్యంపై మహిళాపోలీసులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ

పామూరు: బాల్య వివాహాలు, బాల కార్మికవ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బంగారు బాల్యం కార్యక్రమంపై మహిళా పోలీసులతో సమీక్షా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమని, ఆరోగ్యానికి హానికరమన్నారు. బాలల అక్రమ రవాణా నిర్మూలించాలని, దీనిపై ఎవరికైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియపరచాలన్నారు. పిల్లలు పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు, విద్యకు అధికప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎవరైనా బడిఈడు పిల్లలు బడి మానివేసి ఉంటే వెంటనే వారిని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. బడిఈడు పిల్లలను పాఠశాలకు కాకుండా పనులకు పంపవద్దని, వారిని బాలకార్మికులుగా మార్చి వారి జీవితాలను కష్టాలమయం కాకుండా చూడాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ పొన్నరుసు వెంకటేశ్వర్లు, ఎన్‌జీఓ డాక్టర్ నాయబ్‌రసూల్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హనుమంతునిపాడు:

మండలంలోని పాత నీలకంఠాపురం గ్రామంలో శనివారం సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు స్వామిని పట్టువస్త్రాలతో అలంకరించారు. కాటినేని వెంకటేశ్వర్లు, చెన్నమ్మ దంపతులు స్వామికి శేష వస్త్రాలు అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకుల వేద మంత్రాల నడుమ సీతారాముల వారికి మేళతాళాల సందడితో వైభవంగా స్వామి కల్యాణం జరిపించారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

సీఎస్‌పురం(పామూరు): ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎస్‌కేవై.పెదమస్తాన్ అన్నారు. సీపీఐ జిల్లా మహాసభల పత్రాలను శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో ఆగష్టు 20 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయన్నారు. నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలన్నారు. సంయుక్త కార్యదర్శి జి.నరసింహులు, ఎస్‌కేవై మౌలాలి, యస్.రమేష్, గోవింద్, నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్ తనిఖీ

పీసీపల్లి: మండల పరిధిలోని పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్‌లను తహసీల్దార్ ఉషా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెట్రోల్ బంకులు యజమానులు అవకతవకలకు పాల్పడకుండా వినియోగదారులకు సహకరించాలని సూచించారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డులు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. ఈమె వెంట వీఆర్వోలు అధికారులు ఉన్నారు